క్లుప్తంగా

జగ్గిరెడ్డిని కలసిన మున్సిపల్ చైర్‌పర్సన్



జగ్గిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. గోపాలపురంలోని ఆయన నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తాడి రామారావు, యర్రగంట అయ్యప్ప, సాధనాల శివభగవాన్ పాల్గొన్నారు.

21న శాంతియుత ర్యాలీ

రామచంద్రపురం రూరల్: వక్ఫ్ చట్ట సవరణలకు వ్యతిరేకంగా ఈ నెల 21న చేపట్టనున్న శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ గురువారం పిలుపునిచ్చింది. ఈ మేరకు రామచంద్రపురం నియోజకవర్గంలోని ముస్లిం మత పెద్దలు ద్రాక్షారామ పెద్ద మసీదులో గురువారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ముస్లింలు ఈ నెల 21న ఉదయం 8.30కు ద్రాక్షారామ బోస్ బొమ్మ సెంటర్‌కు చేరుకోవాలన్నారు. యానాం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, శాంతియుత ర్యాలీ ప్రారంభిస్తారని చెప్పారు. రామచంద్రపురం పెద్ద మసీదుకు చేరుకుని, జమాత్ అనంతరం రామచంద్రపురం ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తారని తెలిపారు.

భవిత పాఠశాలకు స్పైరల్ బైండింగ్ మెషీన్ అందజేత

కపిలేశ్వరపురం: స్థానిక భవిత స్కూల్‌కు అంగర గ్రామానికి చెందిన తోరాటి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు రూ.5 వేల విలువగల స్పైరల్ బైండింగ్ మెషీన్‌ను అందజేశారు. శ్రీనివాస్ దంపతులు, ఆయన తల్లిదండ్రులు తోరాటి కనక రామకృష్ణ, వెంకటలక్ష్మి, సోదరుడు తోరాటి రాము ఆర్థిక సాయంతో సమకూర్చిన మెషీన్‌ను గురువారం పాఠశాల నిర్వాహకులకు అందజేశారు. అంగరకి చెందిన పిల్లా బసవరాజు,డి.శరత్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం

రామచంద్రపురం: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్రలో భాగంగా ఈ–వేస్టుకు సంబంధించి అవగాహన కార్యక్రమాన్ని గురువారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ–వేస్ట్‌ను ఎరుపు రంగు డస్ట్‌బిన్‌లో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.ఎస్.శ్రీనివాస్. పి.సారా, రఘురాం తదితరులు పాల్గొనారు.

బీజేపీలో చేరిన వాకతిప్ప సర్పంచ్

కపిలేశ్వరపురం: మండలంలోని వాకతిప్ప సర్పంచ్ కొరిపెల్ల వెంకట నాగస్రవంతి బుధవారం రాత్రి బీజేపీలో చేరారు. రాజమహేంద్రవరంలో ఆ పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో పార్టీ కండువాను కప్పుకొన్నారు. నరేంద్రమోడీ సంక్షేమ పథకాలకు ఆకర్షితురాలినై పార్టీలో చేరినట్టు సర్పంచ్ స్రవంతి తెలిపారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

మండపేట: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మిర్చి కొనుగోలు చేసి రైతులను ఆదుకోకపోతే కాంగ్రెస్ పార్టీ తరఫున ఉద్యమిస్తామని ఏపీ కిసాన్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ కామన ప్రభాకరరావు హెచ్చరించారు. మండపేట పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ విధానాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగుల్చుతున్నాయని మండి పడ్డారు. పండించిన మిర్చి కొనేవారు లేక మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గుంటూరులో మిర్చి రైతులు ఆందోళనకు దిగితే చంద్రబాబు మద్దతు ధర కొనుగోలుకు చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. నేటికీ అతీగతీ లేదని ఆరోపించారు. వెంటనే కొనుగోలు ప్రారంభించకపోతే రైతు పక్షాన పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాలి

రాయవరం: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పడం ద్వారా సర్కారీ స్కూళ్లను బలోపేతం చేయాలని రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని వెంటూరులో ఉపాధ్యాయులతో కలిసి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు చిన్నారులంతా పాఠశాలల్లోనే ఉండాలన్నారు. ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. అలాగే ప్రస్తుతం పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి తదుపరి తరగతిలో కొనసాగేలా చూడాలన్నారు. రాత్రి సమయంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో 20 మంది విద్యార్థులను ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు. పంచాయతీ వార్డు సభ్యుడు డి.ఏడుకొండలు, పాఠశాల హెచ్‌ఎం విల్లూరి వీరభద్రరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జల పుష్పాల జాడేది..?

- కనుమరుగవుతున్న సంప్రదాయ చేపల వేట
- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు
- ఆకాశాన్నంటుతున్న కాలువ చేపల ధరలు
- నిరాశ చెందుతున్న కొనుగోలుదారులు



యర్రపోతవరం వద్ద కాలువలో చేపల కోసం వల విసురుతున్న వ్యక్తి



కాలువ చేపలు

కె.గంగవరం: ప్రతి ఏటా గోదావరి సెంట్రల్ డెల్టాకు సాగునీరు నిలుపుదల చేయడంతో మత్స్యకారులు, సామాన్య ప్రజలు సైతం చేపల వేటలో నిమగ్నమయ్యేవారు. గ్రామాల్లో సైతం కాలువలకు అడ్డుగా మావులు వేసి, చేపలను పట్టి మాంసాహార ప్రియులు రుచిగా వండుకుని తినేవారు. గోదావరి, సముద్ర చేపలతో పోలిస్తే కాలువ చేపలకు మంచి డిమాండ్‌తో పాటు, ప్రజల్లో ఆసక్తి కూడా ఉంటుంది. క్రమేణా కాలువ చేపలు కనుమరుగవుతుండడం సర్వత్రా ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో కాలువలు మూసేసిన వెంటనే అధిక సంఖ్యలో లభ్యమయ్యే బొమ్మిడాయిలు, కొరమేనులు, పీతలు, పిత్త పరిగెలు, గొరసలు వంటివి ప్రస్తుతం మచ్చుకైనా కానరావడం లేదు.

నామమాత్రంగా లభ్యత

రామచంద్రపురం నియోకవర్గంలోని వెల్ల లాకులు, కూళ్ల గ్రామాల్లో ఇప్పటికే అడపాదడపా పడుతున్న చేపలను అధిక రేట్లుకు అమ్మినా మాంసాహార ప్రియులు ఎగబడి మరీ కొనుగోలు చేస్తున్నారు. మత్స్యకారులు వేట కొనసాగించినా చేపల లభ్యత నామమాత్రం కావడంతో వారి జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఆంధ్ర జలచరాల వంటకాల్లో ప్రాముఖ్యం సంతరించుకున్న ఈ జల పుష్పాలు కాలక్రమేణా కనుమరుగవుతుండడంతో మాంసాహార ప్రియులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. దీనికితోడు పిత్తపరిగలతో పాటు, కాలువల్లో లభ్యమయ్యే కొన్ని రకాల చేపలు తినడం ఆరోగ్యానికి కూడా మంచిదని పూర్వ కాలం నుంచీ నానుడి ఉంది. అలాంటి చేపలు కానరాకపోవడం వల్ల నిరాశ చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరో ఐదారేళ్లలో కాలువ చేపలు పూర్తిగా కనుమరుగు కాకతప్పదని మత్స్యకార నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కాలువలు మూసివేశాకే..

బొమ్మిడాయిలు, కొరమేనులు ఇక్కడ సంప్రదాయ చేపలు. అవి బురద, కాలువ అడుగు భాగంలో జీవిస్తాయి. ఏప్రిల్, మే నెలల్లో కాలువలు మూసివేసిన తరువాత ఈ రకం చేపలు ఒకప్పుడు అధికంగా లభించేవి. ప్రస్తుతం అవి కనుమరుగవుతున్నాయని పల్లె ప్రజలు, వృద్ధులు చెబుతున్నారు. అంతరించుకుపోతున్న ఈ చేపలు అడపాదడపా మార్కెట్‌లో దొరకడంతో వీటి ధర చుక్కలను తాకుతోంది. సాధారాణ చేపల ధర కిలో రూ.200 ఉంటే, బొమ్మిడాయిలు, కొరమేనుల ధర రూ. 400కు, అంతకుమించి విక్రయిస్తున్నారు. మత్స్య శాఖ దృష్టి సారించి కనుమరుగవుతున్న ఆయా చేపలను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రుచికి రుచి.. ఆరోగ్యమూ..



కాలువ చేపలు రుచికి రుచి ఉండడంతో పాటు, ఆరోగ్యానికి కూడా మంచివి. మా చిన్నతనంలో వేసవి కాలం వచ్చిందంటే చిన్న చేపల కోసం ఎరుదు చూసే వాళ్లం. ఆ చేపలు తినడం ఎంతో సంతోషకరంగా ఉండేది. కానీ ఇప్పుడు ఈ రకం చేపలు కనుమరుగయ్యాయి. కనీసం చిన్న కాలువల్లో మావులు కూడా వేసే వారు కరువయ్యారు.

– రాయుడు జగన్, నల్లచెరువు పుంత

మత్స్య సంపదను కాపాడుకోవాలి



కాలువల్లో దొరికే మత్స్య సంపద నానాటికీ కనుమరుగవుతోంది. భావితరాల కోసం అంతరించుకుపోతున్న కాలువ చేపలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ప్రస్తుతం ఎంత వెతికినా కాలువ చేపల జాడ దొరకడం లేదు.

– పెంకే రవిచంద్ర, పామర్రు

ఘనంగా ధనమ్మ తల్లి తీర్థం



ధనమ్మ తల్లి ఆలయాల వద్ద కిటకిటలాడిన కాకినాడ–కోటిపల్లి రోడ్డు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం, కరప మండలం కొంగోడు గ్రామాల సరిహద్దులో వెలసిన ధన మహాలక్ష్మి (ధనమ్మ తల్లి) అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం రాత్రి రెండు గ్రామాల్లోనూ కోల సంబరాలు, గారడీ, కోయ మేళాలు, గరగ నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర నిర్వహించిన భక్తులు.. గురువారం వేకువజాము నుంచి ఆలయాల వద్ద తీర్థ మహోత్సవాలు నిర్వహించారు. కాకినాడ, రామచంద్రపురం, మండపేట, యానాం, కోటిపల్లి తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి భక్తుల తాకిడి ప్రారంభమై, ఆలయం వద్ద రద్దీ పెరిగింది. దూర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ ఎక్కువవ్వటంతో, కాకినాడ–కోటిపల్లి రోడ్‌లో కరప మండలం గొర్రిపూడి నుంచి కాజులూరు మండలం ఆర్యావటం వరకు రహదారి కిక్కిరిసింది. సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఉంటారని నిర్వాహకుల అంచనా. మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాలను, పరిసరాల్లో విద్యుద్దీపాలంకరణ, భారీ కటౌట్లతో అలంకరించారు. భక్తుల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దారిపొడవునా చలివేంద్రాలు ఏర్పాటు చేసి, భక్తులకు మజ్జిగ, తాగునీరు సరఫరా చేశారు. రాత్రి ఆలయాల వద్ద భారీఎత్తున బాణసంచా కాల్చారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కరప, గొల్లపాలెం, కోరంగి, ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ల సిబ్బంది డవదోడస్తు నిర్వహించారు. కాకినాడ–కోటిపల్లి రహదారిలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనాలను గొల్లపాలెం పంచాయతీ వెనుక రహదారి నుంచి కొంగోడు మీదుగా గొర్రిపూడి వైపు మళ్లించారు. కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్, కరప ఎస్సై సునీత తదితరులు బందోబస్తు పర్యవేక్షించారు. ఇలాఉండగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం అమ్మవారిని దర్శిచుకుని, ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలని అమ్మవారిని కోరుకున్నానన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగాల నియామకం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు చెందిన మండలాల పార్టీ యువజన విభాగ కమిటీల అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. రాజోలు నియోజకవర్గంలోని మలికిపురం మండల పార్టీ యువజన కమిటీ అధ్యక్షుడిగా కొప్పిశెట్టి హేమ పూర్ణ రాము, మామిడికుదురు మండల (పార్ట్) అధ్యక్షుడిగా ఉచ్చుల మోహన్, రాజోలు మండల అధ్యక్షుడిగా వాసంశెట్టి శ్రీహరి, సఖినేటిపల్లి మండల అధ్యక్షుడిగా గేదెల చిట్టిబాబును నియమించింది. అమలాపురం నియోజకవర్గంలో అమలాపురం పట్టణ అధ్యక్షుడిగా ఫణి దూడల, రూరల్ మండల అధ్యక్షుడిగా కేతా భానుతేజ, అల్లవరం మండల అధ్యక్షుడిగా బళ్ల శ్యామ్‌కుమార్, ఉప్పలగుప్తం మండల అధ్యక్షుడిగా ఓగూరి విజయ్ కుమార్ నియమితులయ్యారు. అలాగే రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం పట్టణ అధ్యక్షుడిగా శలగల మధురాజు, రామచంద్రపురం మండల అధ్యక్షుడిగా తెలగాని సూర్యప్రకాష్, కాజులూరు మండల అధ్యక్షుడిగా పింకె వెంకట రమణ, కె.గంగవరం మండల అధ్యక్షుడిగా మేడిశెట్టి గోవిందరాజును నియమించింది. పి.గన్నవరం నియోజకవర్గంలోని అయినవిల్లి మండల అధ్యక్షుడిగా కుసుమ వెంకటరమణ, అంబాజీపేట మండల అధ్యక్షుడిగా సూదాబత్తుల రామారావు, మామిడికుదురు మండల (పార్ట్) అధ్యక్షుడిగా మట్టపర్తి శ్రీమన్నారాయణ, పి.గన్నవరం మండల అధ్యక్షుడిగా మట్టపర్తి సోమశేఖర్‌ను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది.

వరి పంట కోతల్లో జాగ్రత్తలు అవసరం

కాజులూరు: డెల్టా ప్రాంతాల్లో వరి పంట ప్రస్తుతం కోత దశకు చేరింది. దిగుబడి ఆశాజనకంగా ఉండి, వాతావరణం అనుకూలంగా ఉండటంతో పంటను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు ఉవ్విళ్లూరుతున్నారు. కోతల సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గింజ నాణ్యత తగ్గిపోతే కొనుగోలుదారులు పంటను కొనకపోవటం, ధర తగ్గించడం చేస్తారన్నారు. అందువల్ల కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ గురువారం పలు సూచనలు చేశారు. పంట కోతలకు ముందు రకాన్ని బట్టి పంట కాలవ్యవధిని ముందుగా గుర్తించాలి. కంకిలోని చివరి గింజ తోడుకునే వరకూ పంట కోత చేపట్టరాదు. వరి గింజను కొరికినప్పుడు ఫట్ మనే శబ్దంతో విరగాలి. కోతకు పది రోజుల ముందు పొలంలో నీటిని పూర్తిగా తొలగించాలి. కోసిన వరి పనలను రెండు రోజులు ఆరనిచ్చి, తిరగేసి మరో రెండు రోజులు ఎండనిచ్చి మాసూళ్లు చేసుకోవాలి. గింజలో తేమ 17 శాతం ఉన్నప్పుడే మంచి ధర వస్తుంది. పంట పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతే కోత కోయాలి. విత్తన వరి సాధారణ పంట కంటే 15 నుంచి 20 రోజులు ముందుగానే కోతకు వస్తుంది. విత్తన వరి సాగు చేసిన పొలాల్లో కోత సమయంలో పక్క పొలం నుంచి నీరు రాకుండా గట్టు ఎత్తుగా ఉండేలా చేయాలి. వరి కోతకు యంత్రాలను వినియోగిస్తే అది సక్రమంగా పనిచేస్తుందో లేదో గమనించాలి. లేకుంటే గింజలు నష్టపోయే అవకాశం ఉంది. మొక్క కింద భాగం కంకి వరకు కోయాలి. దీంతో కాండం తొలుచు పురుగు మరొక పంటకు చేరకుండా జాగ్రత్త పడవచ్చు.

సమస్యల పరిష్కారానికి సీహెచ్‌ఓల ఆందోళన



గొల్లపాలెం పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న సీహెచ్‌ఓలు



ద్రాక్షారామ పీహెచ్‌సీ వద్ద సీహెచ్‌ఓల నిరసన

కాజులూరు: తమ న్యాయమైన సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరుతూ గొల్లపాలెం పీహెచ్‌సీ వద్ద గురువారం సీహెచ్‌ఓ(కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్లు)లు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ డిమాండ్లపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓల సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ, ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్) కింద సీహెచ్‌ఓలుగా పనిచేస్తున్న తాము కొన్నేళ్లుగా జీతభత్యాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. 23 శాతం వేతన సవరణ చేయాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్న తదితర డిమాండ్లపై అనేక వినతిపత్రాలు సమర్పిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై నిరసన కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓల సంఘ సభ్యులు పి.ధనలక్ష్మి, వాసవీదుర్గా, వి.జ్యోతి, టి.లావణ్య, జి.సంధ్య, ఎం.ఐశ్వర్య, కె.కృష్ణకుమారి, పి.హర్షిణి, ఎం.ప్రియాంక పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: సీహెచ్‌ఓలుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ద్రాక్షారామ పీహెచ్‌సీ వద్ద వారు ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు. సర్వీసును క్రమబద్ధీకరించాలని, 23 శాతం జీతాలు పెంచాలని, పెండింగ్ ఇన్సెంటివ్‌లను వెంటనే ఇవ్వాలని తదితర డిమాండ్లతో నినాదాలు చేశారు. అలాగే నిర్దిష్ట జాబ్ చార్ట్, పూర్తి స్థాయి అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు ఇవ్వాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి ప్రత్యేక రాయితీలు కల్పించాలని కోరారు.

ఎకరాకు 50 బస్తాల దిగుబడి



టేకిలో పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

కపిలేశ్వరపురం: మండలంలోని టేకి, కోరుమిల్లి, వడ్లమూరు, మాచర గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాఖ, గణాంక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో వరి పంట కోత ప్రయోగాలు చేపట్టారు. కాగా ఎకరాకు 50 నుంచి 55 బస్తాల దిగుబడి వచ్చినట్టు నిర్ధారించారు. ఆయా గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో పొడవు, వెడల్పులలో 5 చదరపు మీటర్లు చొప్పున వరి కంకులను కోసి తూచారు. మండలంలో 60 పంట కోత ప్రయోగాలను చేపట్టాల్సి ఉండగా ఏడు ప్రయోగాలను పూర్తి చేశామని మండల వ్యవసాయశాఖాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్, గణాంక శాఖ రామచంద్రపురం డివిజన్ అధికారి సీహెచ్.సూర్యనారాయణమ్మ, ఏఎస్‌ఓ సీవీవీ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సహాయకులు గంజా హరిబాబు, వీఆర్‌ఏ గంగరాజు, దాకి ఏసు, వడ్లమూరి సూరిబాబు, రైతులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో ముందుకు..

- డీఈవో సలీం బాషా
- ఘనంగా జిల్లా ఈఎండీపీ ఎక్స్‌పో

రామచంద్రపురం: విద్యార్థులు పాఠశాల దశనుంచే వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా పిలుపునిచ్చారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లాస్థాయి ఎక్స్‌పో నిర్వహించారు. రామచంద్రపురం డీవైఈవో పి రామలక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యార్థి దశ నుంచే పారిశ్రామికవేత్తలుగా తయారు చేసేందుకు ఇస్తున్న శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఫైనాన్స్ అండ్ అకౌంట్ అధికారి జి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఈఎండిపి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన సమగ్ర శిక్ష ఏఎంఓ పి.రాంబాబు జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యంను అభినందించారు. అనంతరం జిల్లా ఈఎండీపీ ఎక్స్‌పోను డీఈవో డాక్టర్ సలీం బాషా ప్రారంభించారు. మండపేట, పాలగుమ్మి, అనాతవరం, ఇందుపల్లి, కాలేరు పొన్నమండ, అమలాపురం, గంగలకుర్రు అగ్రహారం ఉన్నత పాఠశాల నుంచి ఈఎండీపీ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టులలో జెడ్పీ ఉన్నత పాఠశాల పాలగుమ్మి, మండపేట ఎస్‌జీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ,ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఇందుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతి అందజేశారు. జిల్లాస్థాయిలో ప్రథమ ద్వితీయ స్థానాలు పొందిన పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎక్స్ పో లో పాల్గొంటారని జోనల్ కోఆర్డినేటర్ నవ్య తెలిపారు. జ్యూరీ కమిటీ సభ్యులుగా డివైఈఓ పి.రామలక్ష్మణమూర్తి, డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సారా, ఎఫ్ఏఓ జి. ప్రవీణ్ కుమార్, ఏఎంఓ పి.రాంబాబు, ఐఈ కోఆర్డినేటర్ ఎంపీపీ సత్యనారాయణ వ్యవహరించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల రూపకల్పన చేసిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారులు తాడి వీర రాఘవ రెడ్డి, బి.శ్రీనివాసరాజు, సీహెచ్ వీ సోమిరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి ఈఎండీపీ ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దీఈఓ డాక్టర్ సలీం బాషా

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థినులను సత్కరిస్తున్న డీఈఓ సలీంబాషా

మండపేట: ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చాటిన ఏడిద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ప్లస్) విద్యార్థులు జిల్లాలో ది బెస్ట్ అని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సలీం బాషా అన్నారు. ఇతర ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఏడిద పాఠశాల ఆదర్శనీయమన్నారు. బడి ఆకర్షణ వారోత్సవాల సందర్భంగా గురువారం ఆయన పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన పంతం రమ్యశ్రీ (433/440), రూ.5 లక్షల నగదు బహుమతి గెలుచుకున్న స్టేట్ బెస్ట్ మార్క్ విజేత కొమ్ము శైలజ (946/1000), కాలేజీ ప్రథమస్థానం దక్కించుకున్న బాదంపూడి సత్యశ్రీ (869/1000)లను డాక్టర్ సలీం బాసా ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు ముంగర వెంకటరాజు, ఉపాధ్యాయుల కృషిని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో నాయుడు రామచంద్రరావు, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, మాజీ సర్పంచ్ చిలుకూరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23న పుంతలో ముసలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రాయవరం: స్థానిక గ్రామ దేవత పుంతలో ముసలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఈ నెల 22న బహుళ నవమిని పురస్కరించుకుని ఉదయం 10.30 గంటలకు వినాయక పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, మండపారాధన, అమ్మవారికి జలాదివాసం, పుష్పాదివాసం, అంకురార్పన, అగ్నిమథనం, హోమం, క్షీరాధివాసం తదితర పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు. 23న ఉదయం 10.42 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపడతామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. 26న అమ్మవారి జాతర, 27న అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. రాయవరం, పరిసర గ్రామాల భక్తులు విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొనాలని కోరారు.

20న చంద్రన్న ఉద్యోగ భవన్ ప్రారంభం

రామచంద్రపురం: నిరుద్యోగ నిర్మూలనలో భాగంగా రామచంద్రపురంలో చంద్రన్న ఉద్యోగ భవన్ కార్యాలయాన్ని ఈ నెల 20న ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. తన కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ, సుమారు 300 కంపెనీలతో అవగాహన ఒప్పందం చేసుకుని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. నిరుద్యోగులు నేరుగా తమ వివరాలతో ఉద్యోగ భవన్‌కు వెళ్లి ఉపాధి అవకాశం పొందవచ్చన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పిస్తున్నామన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా పలు జాబ్ మేళాలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

ఆదివారపుపేటలో డెంగీ కలకలం



ఆదివారపుపేటలో పారిశుధ్య పనులు చేయిస్తున్న వెంకటేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం ఆదివారపుపేటలో డెంగీ కేసు నమోదు కావడం కలకలం రేపింది. జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు గురువారం గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గ్రామానికి చెందిన అల్లక సత్యశివ బాలయోగి గత గురువారం నుంచి జ్వరంతో బాధపడుతూ ద్రాక్షారామలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. జ్వరం తగ్గకపోవడంతో శనివారం కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లారు.

అక్కడ పరీక్షించిన వైద్యులు డెంగీగా తేల్చి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా మలేరియా అధికారి ఆదివారపుపేట గ్రామంలో గురువారం పలువురు జ్వర బాధితులను పరీక్షించారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారులు నాగబాబు, సత్యనారాయణ, డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ ప్రశాంతి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత శ్రీనుకు పరామర్శ

మండపేట: మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నేత కోళ్ల శ్రీనివాస్‌ను ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు) గురువారం పరామర్శించారు. రైతు బజార్ సమీపంలోని కోళ్లవారి తోట వీధిలో శ్రీనివాస్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. అతని తల్లి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పెంకే గంగాధర్, పార్టీ సీనియర్ నాయకులు తాడి రామారావు, ముక్కా దాలయ్య, అధికారి శ్రీను, పెంకే వెంకట్రావు, దుగ్గిరాల రాంబాబు, పిఠాపురం సత్యనారాయణ, గుమ్మిలేరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



శ్రీనును పరామర్శిస్తున్న రాజబాబు, పార్టీ నాయకులు